ఇసుక డంపులు సీజ్

పోతంగల్, డిసెంబర్ 12: మండలంలోని మంజీరా రెండో బ్రిడ్జి సమీపంలో అనుమతి లేకుండా, అక్రమంగా నిల్వ ఉంచిన రెండు ఇసుక డంప్‌లను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. పక్కా సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి 20 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 12: మండల కేంద్రానికి చెందిన బండి గంగారాం (55) ప్రమాదవశాత్తు గ్రామ చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారిఅందులో పడి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య భారతి, కూతురు సౌమ్య ఉన్నారు.

విద్యార్థులను రెగ్యులర్‌గా కాలేజీకి పంపించాలి

ధర్పల్లి, డిసెంబర్ 12: విద్యార్థులను క్రమం తప్పకుండా కాలేజీకి పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనాథ్ అన్నారు. కాలేజీలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల వార్షిక పరీక్ష కోసం 90రోజుల ప్రణాళికను రూపొందించామని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని తల్లిదండ్రులకు వివరించారు. లెక్చరర్లు సురేశ్‌బాబు, హరిత, మహేశ్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కాలేజీ తనిఖీ

ఖలీల్‌వాడి, డిసెంబర్ 12: జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ గురువారం తనిఖీ చేశారు. నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ల నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు, పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కార్యాలయ రిజిస్టర్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళికాబద్ధంగా బోధన, నిర్వహణ జరగాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రం..

చందూర్, డిసెంబర్ 12: మండలంలోని లక్ష్మాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌ను తహసీల్దార్ శాంత గురువారం సందర్శించారు. చిన్నారులకు అందజేస్తున్న పోషకాహారాన్ని తనిఖీ చేశారు. వారితో అక్షరాలను చదివించారు.

స్టడీ టూర్‌కు తరలిన రైతులు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 12: మండలంలోని మనోహరాబాద్‌కు చెందిన జేఎంకే పీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులు స్టడీ టూర్‌కు బయల్దేరారు. రైతులు వెళ్లే వాహనాన్ని మండల వ్యవసాయాధికారిణి దేవిక గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం డైరెక్టర్ పాటుకూరి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని ఇంగోలి వద్ద దత్తగురు నాసిక్‌లోని సహ్యాద్రి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను 45మంది రైతులు సందర్శించనున్నట్లు తెలిపారు. సంఘం డైరెక్టర్లు అల్లూరి సంతోష్, వెల్మ సంతోష్, గడ్డం శ్రీనివాస్, భోజన్న, నాగేశ్, కొలి రాజు, గడ్డం లక్‌పతిరెడ్డి, మైలారం, కలిగోట్, మనోహరాబాద్, జక్రాన్‌పల్లి, పడకల్ గ్రామాల నుంచి రైతులు తరలివెళ్లామన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే

కంఠేశ్వర్/ధర్పల్లి, డిసెంబర్ 12: జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ గురువారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ధర్పల్లి మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను తహసీల్దార్ మాలతి గురువారం పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమెవెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

విద్యార్థులు ఉపాధి కోర్సులపై దృష్టి సారించాలి

టీయూ వీసీ యాదగిరి రావు

మాట్లాడుతున్న టీయూ వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, డిసెంబర్ 12: విద్యార్థులు ఉపాధి కోర్సులపై దృష్టి సారించాలని టీయూ వీసీ యాదగిరి రావు సూచించారు. టీయూలోని జంతుశాస్త్ర విభాగం విద్యార్థులకు సెరికల్చర్, కేంద్ర పట్టుపరిశ్రమ బోర్డు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 'హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్' నిర్వహించారు. గురువారం నిర్వహించిన సమావేశానికి వీసీ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నశీలతోపాటు విద్యార్థులను అభినందించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు మల్బరీ కల్చర్, పట్టు రోలింగ్ విధానం, చాకిగుడ్ల ఉత్పత్తి కేంద్రం నిర్వహణ, మార్కెటింగ్ పద్ధతులు తదితర అంశాలను వివరించారు. నేషనల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ యాదవ్, రాఘవేంద్ర హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సెరికల్చర్ ఆఫీసర్ ఐలయ్య రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారని విభాగాధిపతి తెలిపారు. కార్యక్రమంలో ఆచార్యులు సునీల్‌కుమార్, విజయ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీయూలో ఇంటర్ కాలేజీ వాలీబాల్ పోటీలు..

టీయూలో ఇంటర్ కాలేజీ వాలీబాల్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ –2024 పోటీలను టీయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహించడం యూనివర్సిటీ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకు తగిన సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. పురుషుల విభాగంలో విన్నర్‌గా టీయూ, రన్నర్‌గా గిరిరాజ్ కాలేజీ, మహిళల విభాగంలో విన్నర్‌గా గిరిరాజ్ కాలేజీ, రన్నర్‌గా ఆర్మూర్ టీజీడబ్ల్యూ ఆర్‌డీసీ నిలిచాయి. విజేతలకు టీయూ డైరెక్టర్ డాక్టర్ జి.బాలకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్ నేత, ఫిజికల్ డైరెక్టర్లు బాలమణి, రమ, రూప, అంజలి, అనిల్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తనిఖీలు

కంఠేశ్వర్, డిసెంబర్ 12: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ఆయా ప్రభుత్వ శాఖల ఆఫీసులను అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్య, వైద్యారోగ్య, పౌర సరఫరాలు, సహకార పరిశ్రమలు తదితర శాఖల కార్యాలయాలను సందర్శించారు. అధికారులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో సామరస్యంగా వ్యవహరిస్తూ సంతృప్తికరంగా సేవలందించాలని హితవు పలికారు. కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఆయా శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

వచనాలయం అభివృద్ధికి కృషి

బాపూజీ వచనాలయం నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్, డిసెంబర్ 12: బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వచనాలయ నూతన అధ్యక్షుడు గడ్డం భక్తవత్సలం నాయుడు అన్నారు. ఎన్నికల అధికారి ఎంఎస్ శ్రీహరి ఆచార్య నూతన కార్యవర్గ సభ్యులతో గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉద్యోగార్థుల సౌకర్యార్థం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఎన్నికల అధికారులు డాక్టర్ పులి జైపాల్, అరెట్టి నారాయణ, నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సుభాష్‌నగర్, డిసెంబర్ 12: ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. వర్ని రోడ్‌లోని దత్త నిర్మల ఆశ్రమాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు సాంబయ్యశాస్త్రి, వేదిక రాష్ట్ర ప్రతినిధి రొట్టె యుగేందర్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లతో సమావేశం

సమావేశంలో పాల్గొన్న అధికారులు

కంఠేశ్వర్, డిసెంబర్ 12: జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శశిధర్‌రాజ్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23కు సంబంధించి ప్యాడీ లాట్1,2, 12కు సంబంధించిన వివరాలపై మాట్లాడారు. టెడర్ ప్యాడీకి సంబంధించి పేమెంట్‌ను ఈనెల 31వ తేదీ వరకు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి ఎసీఎస్ఓ, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఖానాపూర్‌లోని శ్రీ తిరుమల శ్రీనివాస ఇండస్ట్రీస్, కాలూర్‌లోని సిద్ధమ్మ రైస్ ఇండస్ట్రీస్, సిద్ధి రామేశ్వర ఇండస్ట్రీస్ కాలూర్, శ్రీనగర్‌లోని శ్రీలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్, అశోక్‌ఫారంలోని శ్రీలక్ష్మి నర్సింహ నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్‌ను ఆయన తనిఖీ చేశారు.

పోలీసు సేవలకు సలాం..!

లలితకు నగదును అప్పగిస్తున్న పోలీసులు

రుద్రూర్, డిసెంబర్ 12: బస్సులో మర్చిపోయిన బ్యాగును బాధితురాలికి అప్పగించి పోలీసులు తాము ప్రజా సేవకులమని నిరూపించుకున్నారు. కోటగిరి మండలంలోని కారేగావ్‌కు చెందిన లలిత బాన్సువాడ నుంచి వచ్చి రుద్రూర్‌లో బస్సు దిగింది. తన వెంట ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయింది. విషయాన్ని వెంటనే హెడ్‌కానిస్టేబుల్ సురేశ్, కానిస్టేబుల్ గంగాధర్‌కు తెలిపింది. దీంతో వారు బస్సును ఛేజ్ చేసి బ్యాగును తీసుకొచ్చి, బాధితురాలికి అప్పగించారు. బ్యాగులో రూ.40వేల నగదు, బంగారు ఆభరణాలు ఉండడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. ఎస్సై సాయన్న వారిని అభినందించారు.

అంతర్జాతీయ యువజన సదస్సుకు ఎంపిక

రవీందర్‌రెడ్డి

డిచ్‌పల్లి, డిసెంబర్ 12: ఒడిశా రాష్ట్రంలోని సంబల్పూర్‌లో ఈనెల 14నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ యువజన సదస్సుకు తెలంగాణ యూనివర్సిటీకి చెందిన ఆచార్య రవీందర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆయనకు గురువారం ఆహ్వానం అందింది. సదస్సులో 22దేశాలు, 28రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 400మంది ప్రతినిధులు పాల్గొననున్నారు. టూరిజం అభివృద్ధి, ఉద్యోగావకాశాల కల్పన అనే చర్చాగోష్టిలో రవీందర్‌రెడ్డి పాల్గొంటారు. అతడిని వర్సిటీ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

కొనసాగుతున్న సమగ్ర ఉద్యోగుల సర్వే

ఖలీల్‌వాడి/కంఠేశ్వర్, డిసెంబర్ 12: నగరంలోని ధర్నాచౌక్‌లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం ఆరో రోజుకు చేరుకున్నది. దీక్షా శిబిరాన్ని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పి.సుధాకర్, వై.ఓమయ్య, సఖి సురేశ్, ఇమ్రాన్‌అలీ, అమర్ సందర్శించి, ఉద్యోగులకు మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 12: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సీనియర్ బేస్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు నాగరాజు, నర్సింహ, జక్రాన్‌పల్లికి చెందిన మల్లమారి ప్రశాంత్ ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గంగామోహన్, వినోద్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వరకు మహబూబాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

హీరో మోహన్‌బాబుపై ఫిర్యాదు

సిరికొండ, డిసెంబర్ 12: జర్నలిస్ట్ రంజిత్‌పై దాడిచేసిన సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్ మిట్టాపల్లి వెంకటేశ్వర్, రిపోర్టర్లు ప్రకాశ్, నరేందర్, రాజన్న, ఆసిఫ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిధులు విడుదల

ఖలీల్‌వాడి, డిసెంబర్ 12: మధ్యాహ్న భోజనానికి సంబంధించి 2024–25 సంవత్సరానికి పెండింగ్, రెగ్యులర్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా విద్యాధికారి అశోక్ గురువారం తెలిపారు. 1 నుంచి 8వ తరగతుల కుకింగ్ క్లాస్‌కు రూ.1,88,90,679, సీసీహెచ్‌ల గౌరవ వేతనం కోసం రూ.69,58,000 నవంబర్ 2024 వరకు మండలాల వారీగా ఎంఈవో ఎస్ఎన్ఏ అకౌంట్లకు రిలీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిధులను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు పీఎఫ్ఎంఎస్ ద్వారా విడుదల చేయాలని స్థానిక ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

ఇందూరుకు చేరుకున్న గో సంరక్షణ పాదయాత్ర

సుభాష్‌నగర్, డిసెంబర్ 12: హైదరాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన గోసంరక్షణ మహా పాదయాత్ర గురువారం నగరంలోని నీలకంఠేశ్వరాలయానికి చేరింది. గోమాతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నీలకంఠేశ్వరాలయం నుంచి రైల్వేస్టేషన్ శివాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉత్తర తిరుపతి క్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో బాలకృష్ణ గురుస్వామి మాట్లాడారు. శ్రీనగర్ ఆదిశంకరాచార్య మందిరం నుంచి అక్టోబర్ 6వ తేదీన ప్రారంభమైన గో సంరక్షణ మహా పాదయాత్ర 14 రాష్ట్రాల్లో 180 రోజులపాటు కొనసాగనున్నదని తెలిపారు. ప్రభుత్వం గోహత్యను నిషేధించాలని, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. గో రక్షక్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జరిమానా

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్12: ఒకరి పరీక్ష మరొకరు రాసి పట్టుబడిన కేసులో ఇద్దరికీ రూ.పదివేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి గురువారం తీర్పును వెల్లడించారని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఏసీపీ కథనం మేరకు.. 2017లో ఆర్మూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో ఓపెన్ ఎస్సెస్సీ పరీక్ష రాయాల్సిన ఎండీ.ఫయిజుద్దీన్‌కు బదులుగా ఎండీ.ముమీత్ రాస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబడ్డాడు. పరీక్షా సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : NIZAMABAD
IN
OS.No. 174 of 2023
Between:-
Mr.Tiviti Krishna Chandra ...Petitioner/Plaintiff
AND
P. Gangadhar and other
Respondents/Defendants
To
P. Gangadhar S/o. Malakaiah, age 57 years. Occ: Agriculture, R/o. Subhash Nagar, Nizamabad
Take notice that my client has filed declaration to declare that registered agreement of sale-cum-general power of attorney doc, no. 11086/2002 dated 23.12.2002 and registered sale deed doc, no. 7183/2003 dated 30.8.2003 as null and void and for perpetual injunction against the defendants on the file of Prl. Junior Civil Judge, Nizamabad, number of times notices were sent to you, but you are returned as not residing, for which my client has taken steps, so as a means of substitute service of serving notice on you, please take notice that the matter is posted on **26.12.2024** so, please be present either in person or through pleader, failing which, the matter will be decided in your absence.
// BY ORDER OF THE COURT //
Dt:11-12-2023
Nizamabad. Sd/-
P. Shyam Rathan
Advocate, Nizamabad.

మడిగెలను తెరిపించారు..

బోధన్, డిసెంబర్ 12: బోధన్ పట్టణంలోని మున్సిపల్ మడిగెల 25 ఏండ్ల ఒప్పందం కాలపరిమితి పూర్తి కావడంతో ఖాళీ చేయాలని మూడు సార్లు నోటీసులు అందజేశారు. అయినా నిర్వాహకుల నుంచి స్పందన రాకపోవడంతో ఈనెల 7న మున్సిపల్ అధికారులు మడిగెలకు తాళాలు వేశారు. మడిగెల నిర్వాహకులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కరోనా కారణంగా వ్యాపారాలు లేక నష్టపోయామని, నూతనంగా వేలం ప్రక్రియ పూర్తయ్యే వరకు తాము దుకాణాలు కొనసాగించుకునేందుకు అవకాశం కల్పించాలని వారు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే సూచనల మేరకు మున్సిపల్ అధికారులు మడిగెల తాళాల తీసి పాత నిర్వాహకులకు అప్పగించారు. వీటికి త్వరలో వేలం వేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, **SOMA GANGA REDDY** (Old name) S/o Gangaram R/o H.No: 6-63,Vil, Palem ,Mdl.Morthad,Dist:Nizamabad, TG .Hence My Name Changed As **SOMA GANGARAM** (New Name)
NTZ-338263

WANTED
★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

పాస్‌పోర్ట్ పోయినది
★నేను, చెట్‌పల్లి ప్రశాంత్, తండ్రిపేరు: భూచన్న చెట్‌పల్లి, ఇ.నెం. 1-29/D, గ్రా॥ నర్సపూర్, మం॥ కమ్మర్‌పల్లి, జిల్లా॥ నిజామాబాద్, తెలంగాణ రాష్ట్రం. నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం: U0818940 నెం గల ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తేది. 15-10-2024 నాడు నర్సపూర్ గ్రామం నుండి కమ్మర్‌పల్లికి బైక్ మీద పోయే క్రమంలో మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ నెంబరుకు తెలియజేయగలరు. సెల్: 63032 21527.
NTZ-338248

PLOT FOR SALE
★డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-327118

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి వేముల అండ

తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న వేముల

భీమ్‌గల్, డిసెంబర్ 12: మండలంలోని ఎంజీతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కూన్యా తండాలో భూక్యా మోతీలాల్, బుజ్జిలకు చెందిన పూరి గుడిసె బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. మోతీలాల్ గోవిందపేట్‌లో ఉంటూ పాలేరుగా పని చేస్తున్నాడు. బుజ్జి తన 12 ఏండ్ల కుమారుడితో ఇంట్లో ఉంటోంది. తండాలో రాత్రి సమయంలో చీటికి సంబంధించిన సమావేశం ఉండడంతో తల్లీ కొడుకులు అక్కడికి వెళ్లారు. వారు వచ్చే సరికి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయింది. ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. ఇంట్లో ఉన్న బ్యాంకు, భూమి పట్టా పాస్‌పుస్తకాలు, వడ్లు విక్రయించగా వచ్చిన రూ.50వేల నగదు కాలిబూడిదయ్యాయి.

తెలిసిన వెంటనే స్పందించిన మాజీ మంత్రి

కూన్యాతండాలో షార్ట్‌సర్క్యూట్‌తో భూక్యా మోతీలాల్‌కు చెందిన ఇల్లు కాలిపోయిన విషయం బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలియగానే చలించిపోయిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తహసీల్దార్ షబ్బీర్‌కు ఫోన్ చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అగ్నిప్రమాదంపై తక్షణ సాయం అందజేయాలని, జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదికను అందజేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలల మేరకు తహసీల్దార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు.

రూ.ఐదు వేల ఆర్థికసాయం

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం ఉదయం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ మహేశ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కూన్యా తండాకు చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే పంపించిన రూ.5వేల నగదు, నిత్యావసర సరుకులను వారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోయిజ్, పార్టీ నాయకులు శర్మానాయక్, తుక్కాజి, రాములు, శ్రీనివాస్, సీతారాం సర్దార్, శ్రీకాంత్ ఉన్నారు.



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'ఆలయంలో పాటలు పెడితే నోటీసులా..'

భీమ్‌గల్, డిసెంబర్ 12: తమ తాతముత్తాతల నుంచి ఉన్న ఆలయంలో దేవుళ్ల పాటలు పెడితే పోలీసులు నోటీసులు ఇచ్చారని మాల సంఘ సభ్యులు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట నోటీసులను చూపుతూ బుధవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమ కాలనీలోని ఆలయంలో రోజూ రెండుసార్లు పాటలు పెడుతామని, ఇదే ప్రాంతంలో ఉంటున్న పాస్టర్ పోలీసులకు ఫోన్ చేస్తూ తమపై ఫిర్యాదు చేస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. అదే పాస్టర్ మున్సిపల్ అనుమతి లేకుండా చర్చి ఏర్పాటు చేసి రోజూ ప్రార్థనలు నిర్వహిస్తున్నాడని అన్నారు. ఆ పాస్టర్‌పై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేని యెడల జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో అయ్యప్పస్వామి పడిపూజ బుధవారం రాత్రి నిర్వహించారు. బోధన్ పట్టణం, చుట్టుపక్కల మండలాల నుంచి వందలాది మంది అయ్యప్పస్వాములు తరలివచ్చారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. –బోధన్, డిసెంబర్ 12

కారు బోల్తా.. డ్రైవర్ మృతి

ఆర్మూర్‌టౌన్,డిసెంబర్12: పట్టణంలోని పెర్కిట్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు బోల్తా పడిన ఘటనలో వనపర్తికి చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్(18) మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ కథనం ప్రకారం.. హైదరాబాద్ హయత్‌నగర్‌కు చెందిన మందాల చందు ఆర్మూర్ పట్టణం కోటార్మూర్‌కు చెందిన తన స్నేహితుడు అక్షయ్ మరదలు పెండ్లికి భీమ్‌గల్‌కు అద్దె కారులో వచ్చారు. భీమ్‌గల్ నుంచి పెర్కిట్‌లోని అక్షయ్ ఇంటికి చేరుకున్నారు. అర్ధరాత్రి 1:30 గంటలకు డ్రైవర్ ప్రకాశ్‌తోపాటు మరో ఐదుగురు స్నేహితులతో కలిసి టీ తాగేందుకు బయల్దేరగా క్రాంతి స్కూల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. డ్రైవర్ ప్రకాశ్‌కు తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశ్ ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బంగారం గొలుసు చోరీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్12: పట్టణంలోని మామిడిపల్లి సమీపంలో గురువారం సాయంత్రం స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ కథనం మేరకు.. పెర్కిట్‌లోని తిరుమల కాలనీకి చెందిన సింగారం లలిత తన కొడుకుతో కలిసి అర్గుల్‌లో ఓ ఫంక్షన్ హాల్‌కు వెళ్లింది. తిరిగి వస్తున్న సమయంలో మామిడిపల్లి సమీపంలో గుర్తు తెలియని దుండగులు పల్సర్ బైక్‌పై వెనుక నుంచి వచ్చి మెడలోని బంగారం గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

శక్కర్‌నగర్, డిసెంబర్ 12: పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

భీమ్‌గల్,డిసెంబర్12: పట్టణంలోని పంటపొలాల్లో మృతదేహం కలకలం సృష్టించింది. ఎస్సై మహేశ్ కథనం మేరకు.. పట్టణంలోని మున్సిపల్ అర్బన్ పార్కు సమీపంలో గురువారం పంటపొలాల్లో మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతి చెందిన వ్యక్తి సిరికొండ మండలం గడ్కోల్ గ్రామం వడ్డెర కాలనీకి చెందిన సూర సిద్ది రాములుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

ముప్కాల్, డిసెంబర్12: భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును శుక్రవారం సందర్శిస్తారు. అధికారులతో నిర్వహించనున్న సమీక్షలో పాల్గొంటారు. బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11.45గంటకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.45 గంటలకు తిరిగి వెళ్తారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శక్కర్‌నగర్, డిసెంబర్ 12: బోధన్ పట్టణ శివారులోని పసుపువాగులో గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ వెళ్లి మృతదేహాన్ని బయటికి తీయించి బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. సుమారు 30 ఏండ్ల వయస్సు ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడని, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంటు, గోధుమ రంగు షర్ట్, లేత ఆకు పచ్చ రంగు బనియన్ ధరించి ఉన్నాడని వివరించారు. అనుమానాలు ఉంటే బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్మూర్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

మోర్తాడ్/ ఆర్మూర్‌టౌన్, డిసెంబర్12: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. ఆర్మూర్ పట్టణంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను గురువారం కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయించారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులుంటే చెప్పాలని మున్సిపల్ కమిషనర్ రాజుకు సూచించారు. కమ్మర్‌పల్లి మండలం కేంద్రంతోపాటు ఉప్లూర్, నాగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేతీరును అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, అమృత్ ఉన్నారు.

'ఫ్రైడే-డ్రైడేపై నిర్లక్ష్యం వద్దు'



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి తుకారాం

రెంజల్, డిసెంబర్ 12: ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పాటించకపోవడంతోనే మండలంలో 26 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంపై ఇకనైనా సిబ్బంది తీరుమార్చుకోవాలని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 680 డెంగ్యూ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. దోమలు వృద్ధి కావడంతో డెంగ్యూ, మలేరియా కేసులు పెరిగాయని అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించాలని, కేసులు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఆశవర్కర్ ప్రతి శుక్రవారం 50 నుంచి 100 ఇండ్లు తిరిగి కుటుంబ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్త ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి వినయ్‌కుమార్, హెచ్ఈవోలు కరిపె రవీందర్, శ్రావణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

భీమ్‌గల్, డిసెంబర్ 12: మండలంలోని 27 గ్రామపంచాయతీలు, 244 వార్డుల వారి పోలింగ్‌కేంద్రాల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సంతోష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈనెల 7న అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ప్రదర్శించిన పోలింగ్ కేంద్రాల జాబితాపై చర్చించారు.

2వ రోజు కొనసాగిన రిలే దీక్ష

మాక్లూర్, డిసెంబర్ 12: మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకుల రిలే దీక్ష రెండో రోజు గురువారం కొనసాగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, సాగు భూమి, 200 గజాల ఇంటి స్థలం, ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.